క్లుప్తంగా

మరిన్ని గ్రామాలను దత్తత తీసుకోవాలి

ఆదిలాబాద్‌రూరల్: సర్వీస్ నౌ, నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థలు మారుమూల గిరిజన గ్రామాలను దత్తత తీసుకుని వారి అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మండలంలోని న్యూచించుఘాట్ గ్రామంలో పలువురు రైతులకు ఎడ్లబండ్లు, వ్యవసాయ పొలానికి కంచె తీగలను ఆయా స్వచ్ఛంద సంస్థల ద్వారా శనివారం జిల్లా కలెక్టర్‌తో అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మరిన్ని ఆదివాసీ గ్రామాలు దత్తత తీసుకుని వారి అభివృద్ధికి పాటుపడాలన్నారు. తహసీల్దార్ గోవింద్, ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ డిపో మేనేజర్‌గా బాధ్యతలు



ఆదిలాబాద్: ఆర్టీసీ ఆదిలాబాద్ డిపో మేనేజర్‌గా జి.ప్రతిమారెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. **ప్రతిమారెడ్డి** జిల్లా కేంద్రంలోని డిపో మేనేజర్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించగా, కార్యాలయ సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు. ఇంతకు ముందు ఆమె నిర్మల్ డిపో మేనేజర్‌గా విధులు నిర్వహించి బదిలీపై ఇక్కడు వచ్చారు. ఆదిలాబాద్ డిపో మేనేజర్‌గా వ్యవహరించిన కల్పన జగిత్యాల డీఎంగా బదిలీపై వెళ్లారు.

రాములోరి తలంబ్రాలకు ప్రత్యేక కౌంటర్

ఆదిలాబాద్: భద్రాచల శ్రీ సీతారాముల కల్యాణ తలంబ్రాలను ఆర్టీసీ కార్గో ద్వారా ఇంటి వద్దకే అందజేస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి పేర్కొన్నారు. ఆదిలాబాద్ బస్ స్టేషన్ లో శనివారం శ్రీ సీతారాముల కల్యాణం తలంబ్రాల ప్రత్యేక బుకింగ్ కౌంటర్‌ను ఆమె ప్రారంభించారు. రూ.151 చెల్లించి ప్రత్యేక కౌంటర్‌లో ముందస్తుగా బుకింగ్ చేసుకోవచ్చని వివరించారు. ట్రాఫిక్ సూపర్‌వైజర్ శ్రీరామ్, స్టేషన్ మేనేజర్ పోశెట్టి, కార్గో ఇంచార్జ్ అబ్దుల్ అన్సార్ తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం



స్కానింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

ఆదిలాబాద్‌టౌన్: గర్భస్థ పూర్వ, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ ప్రక్రియ చట్టరీత్యా నేరమని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సాధన అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రావ్య నర్సింగ్ హోమ్, గణపతి డయాగ్నొస్టిక్స్ స్కానింగ్ సెంటర్లను శనివారం ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. స్కానింగ్ వివరాలపై ఆరా తీసి పలు సూచనలు చేశారు. లింగ నిర్ధారణ చేసే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, అవసరమైతే స్కానింగ్ కేంద్రాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఆమె వెంట డాక్టర్ క్రాంతి, సాధికారత మిషన్ కోఆర్డినేటర్ యశోద, వైష్ణవి ఉన్నారు.

'జైనథ్ మార్కెట్ చైర్మన్‌ను సస్పెండ్ చేయాలి'

ఆదిలాబాద్‌టౌన్: అవినీతికి పాల్పడుతున్న జైనథ్ మార్కెట్ చైర్మన్‌ను సస్పెండ్ చేయాలని బీఆర్ఎస్ జైనథ్ మండల ప్రధాన కార్యదర్శి గణేశ్‌యాదవ్ డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమాలకు పాల్పడుతున్న మార్కెట్ కమిటి చైర్మన్ ను వెంటనే పదవి నుంచి తొలగించాలన్నారు. లేకపోతే రైతులకు మద్దతుగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ శ్యామలదలావిని కలిసి వినతిపత్రం అందజేశారు. సమావేశంలో దుమ్మాల దేవన్న, లచ్చారెడ్డి, మేడిపట్ల స్వామి, జక్కుల అడెల్లు, గొడుగుల ఆడేళ్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలి



వంట గదిని పరిశీలిస్తున్న జాదవ్ అంబాజీ

నార్నూర్: ఐటీడీఏ పరిధిలోని ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ అన్నారు. మండలంలోని జామ్డా, మాన్కాపూర్ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. జామ్డాలో పరీక్ష రాస్తున్న పదో తరగతి విద్యార్థులకు ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. మాన్కాపూర్ పాఠశాలలో వంటగదితోపాటు డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అక్కడే మండలంలో పని చేస్తున్న ఐటీడీఏ ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. సమయపాలన పాటించాలన్నారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలన్నారు.హెచ్‌ఎంలు చౌహాన్ వందన, ధన్ను, వార్డెన్ వనిత, రాజశేఖర్ ఉన్నారు.

ఇండోర్‌లో వసతులేవి?

- స్టేడియం నిర్వహణ గాలికి
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా
- రాత్రివేళ మందుబాబులు వీరంగం
- సాధన చేసేందుకు క్రీడాకారుల ఇబ్బందులు



జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియం

ఆదిలాబాద్: జిల్లాకేంద్రంలోని ఇండోర్ స్టేడియం ప్రస్తుతం వసతుల లేమితో దర్శనమిస్తోంది. వీటి నిర్వహణను గాలికొదిలేయడంతో నిరుపయోగంగా మారింది. స్టేడియం ప్రాంగణం పిచ్చిమొక్కలతో స్వాగతం పలుకుతుంది. ఇక్కడ ఆటగాళ్లకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు లేవు. అరకొరగా విద్యుత్ దీపాల కాంతుల నడుమ సాధన చేయాల్సిన దుస్థితి. నీటి వసతి లేకపోవడం, మరుగుదొడ్ల నిర్వహణకు నోచుకోక అస్తవ్యస్తంగా ఉన్నాయి. మౌలిక సదుపాయాల కల్పనలో అధికారులు మీనామేషాలు లెక్కిస్తుండడంతో క్రీడాకారులకు శాపంగా మారుతున్నాయి. కేవలం బ్యాడ్మింటన్ మాత్రమే ఆడుకోవడానికి వీలుగా ఉన్న ఈ స్టేడియానికి పర్యవేక్షించేవారు లేక అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. రాత్రివేళ మందుబాబులు వీరంగం చేస్తున్నారు. మద్యం బాటిళ్లను పగులగొడుతున్నారు. ఉదయం సాధన చేసేందుకు వచ్చే క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. సరైన సాధన లేక జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయి వేదికలపై సత్తా చాటలేకపోతున్నారు.

విలువైన పరికరాలు మాయం

ఇండోర్ స్టేడియానికి ఇన్‌చార్జి ఉన్న సదరు వ్యక్తి ఇష్టారీతిన వ్యవహరిస్తున్నాడని క్రీడాకారులు చెబుతున్నారు. సమయపాలన పాటించడని, స్టేడియం తాళం చెవి ఒకరి కంటే ఎక్కువ మంది ఉంటున్నాయి. నెట్‌పోల్, బెంచ్‌ప్రెస్ వంటి విలువైన పరికరాలు చోరీకి గురయ్యాయని చెబుతున్నారు. గతంలో కొన్ని పరికరాలు మాయమైన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు.



పిల్లర్ల దశలో నూతన స్టేడియం నిర్మాణం

పిల్లర్ల దశలో నూతన స్టేడియం

ఇండోర్ స్టేడియం ప్రాంగణంలో నూతనంగా మరో స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పట్టణ ప్రగతి నిధుల కింద సుమారు రూ.2 కోట్ల అంచనా వ్యయంతో 2022లో పనులు ప్రారంభించారు. అయితే కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడం, నిధుల లేమితో నిర్మాణం పిల్లర్ల దశలో నిలిచింది. ఓ వైపు ప్రస్తుతం ఉన్న ఇండోర్ స్టేడియం నిర్వహణ సరిగ్గా లేకపోవడం నూతన స్టేడియం నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో క్రీడాకారులకు శాపంగా మారింది.

సాధన చేయలేకపోతున్నాం



అరకొర సౌకర్యాలతో స్టేడియంలో పూర్తిస్థాయిలో సాధన చేయలేకపోతున్నాం. కేవలం సాయంత్రం వేళలో సాధన చేయాల్సి వస్తోంది. తాగునీటి వసతి లేకపోవడంతో వాటర్ బాటిళ్లు తెచ్చుకుంటున్నాం. వేసవిలో సరిపోవడం లేదు. మూత్ర విసర్జన బయటకు వెళ్లాల్సి వస్తుంది.

– జశ్వంత్, బ్యాడ్మింటన్ క్రీడాకారుడు, ఆదిలాబాద్

రూమ్ ఏర్పాటు చేయాలి



స్టేడియం అపరిశుభ్రంగా ఉంటుంది. దుమ్ములో ప్రతీరోజు సాధన చేస్తున్నాం. వాష్ రూమ్స్ సరిగ్గా లేక పాఠశాలకు వెళ్లే వరకు ఇబ్బంది పడాల్సి వస్తోంది. స్టేడియం బయట మరుగుదొడ్లను మరమ్మతు చేయించాలి. క్రీడాకారులకు దృష్టిలో పెట్టుకుని చెంజింగ్ రూమ్ ఏర్పాటు చేయాలి.

– సాయిప్రియ, శాలిని, స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థినులు

ఇబ్బంది లేకుండా చర్యలు



ఇండోర్ స్టేడియంలో క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. తాగునీటి వసతి కల్పిస్తాం. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నూతన స్టేడియం నిర్మాణం జరుగుతుంది. అందువల్ల కొంత ఇబ్బంది ఉంది. ఆ నిర్మాణం పూర్తయితే సమస్యలు తొలగిపోతాయి.

– వెంకటేశ్వర్లు, డీవైఎస్‌ఓ

డీఎస్పీ కార్యాలయం తనిఖీ



ఆదిలాబాద్‌టౌన్: సీసీ కెమెరాలు పరిశీలిస్తున్న ఎస్పీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని డీఎస్పీ కార్యాలయాన్ని ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి కేసుల వివరాలు, అనంతరం కమాండ్ కంట్రోల్ రూం, పోలీసు కంట్రోల్ రూంను పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరుపై ఆరా తీశారు. పని చేయని కెమెరాలను వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. అంతకుముందు ఆయనకు డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు. సీఐ సునీల్ కుమార్ తదితరులున్నారు.



ఇచ్చోడలో వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ

ఇచ్చోడ/నేరడిగొండ/సిరికొండ: గంజాయి మత్తు పదార్థాలను అరికట్టాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఇచ్చోడ, నేరడిగొండ, సిరికొండ పోలీస్టేషన్లను శనివారం తనిఖీ చేశారు. స్టేషన్లలో రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలపై ఆరా తీశారు. దాబా హోటళ్లలో అసాంఘిక కార్యకాలపాలను అరికట్టాలన్నారు. ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్, ఇచ్చోడ సీఐ భీమేశ్, ఇచ్చోడ, నేరడిగొండ, సిరికొండ ఎస్సైలు తిరుపతి, శ్రీకాంత్, శివరాం ప్రసాద్ పాల్గొన్నారు.

'మంత్రి సీతక్కకు క్షమాపణ చెప్పాలి'

కైలాస్‌నగర్: ఆదివాసీల ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచే మంత్రి సీతక్కపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సిర్పూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ వెంటనే క్షమాపణలు చెప్పాలని ఆదివాసీ కాంగ్రెస్ కమిటీ జిల్లా చైర్మన్ సెడ్మకి ఆనంద్ రావు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీ మహిళగా ఉమ్మడి జిల్లా అభివృద్ధికి నింతరం పాటుపడుతున్న సీతక్కపై నోటికి వచ్చినట్లు మాట్లాడడం సమంజసం కాదన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని క్షమాపణలు చెప్పాలన్నారు. సమావేశంలో ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అరక శేషురావు, జిల్లా కమిటీ సభ్యులు మేస్రం భాస్కర్, కుమ్ర ఉద్దవ్, కుమ్ర సుంగు, కొట్నాకే భరత్, సిడం ఉత్తమ్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ చర్చ వేదిక ఎందుకు?

తలమడుగు: ప్రజల సమస్యలు పరిష్కరించలేని బహిరంగ చర్చ వేదికలు ఎందుకని అధికారులను ప్రజలు నిలదీశారు. ప్రభుత్వ పథకాలు అందని లబ్ధిదారులు వాటి వివరాలను పరిష్కరించేందుకు పైలెట్ ప్రాజెక్టు కింద మండల కేంద్రంలో రెండో ప్రజావేదిక సమావేశం నిర్వహించారు. రూ.2 లక్షల రుణమాఫీ కాని రైతులు చాలా మంది ఉన్నారని అన్నారు. సబ్సిడీ గ్యాస్ డబ్బులు రావడం లేదని పలువురు ఫిర్యాదు చేస్తే ట్రెజరీలో డబ్బులు లేవని అధికారులు చెపుతున్నారని అన్నారు. తహసీల్దార్ రాజ్‌మోహన్, ఎంపీడీవో చంద్రశేఖర్, ఏవో ప్రమోద్‌రెడ్డి, ఎంపీవో వినోద్, కిసాన్ మిత్ర కోఆర్డినేటర్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆదిలాబాద్‌టౌన్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం డీఎస్పీ హసీబుల్లా అన్నారు. పట్టణంలోని రిటైర్డ్ ఎంప్లాయీస్ సంఘ భవన్‌లో విశ్రాంత ఉద్యోగులు, ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్ ఫోన్‌లో వచ్చే లింక్‌లు ఓపెన్ చేయొద్దన్నారు. సైబర్ నేరం జరిగినట్‌లైతే వెంటనే 1930 నెంబర్‌కు సమాచారమందించాలని పేర్కొన్నారు. రిటైర్డు ఉద్యోగుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మారెడ్డి, కిష్టయ్య తదితరులు ఉన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు నిలయాలు



బజార్‌హత్నూర్: నృత్యం చేస్తున్న విద్యార్థినులు

బజార్‌హత్నూర్: సంస్కృతి సంప్రదాయాలకు శ్రీసరస్వతీ శిశుమందిరాలు నిలయాలని జిల్లా విభాగ్ సహకార్యదర్శి దామోదర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాల 26వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్య ప్రదర్శన, యోగ్ చాప్, నాటికలు ప్రదర్శించారు. ఇదే పాఠశాలలో చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన పూర్వ విద్యార్థులను సన్మానించారు. ఎంఈవో కిషన్‌గుప్తా, పాఠశాల కమిటీ అధ్యక్షుడు నాగనాథ్, హెచ్‌ఎం వెంకటరమణ, మాజీ సర్పంచ్ లావణ్య, విలాస్, పీఏసీ చైర్మన్ వెంకన్నయాదవ్, నర్సయ్య, జయశ్రీ, తిరుమల, వినిల్, స్వప్న, రాజన్న, శంకర్, ఉత్తం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాల 44వ వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం అధ్యాపకులు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలకు సరస్వతి శిశుమందిరాలు పుట్టినిల్లు లాంటివన్నారు. హిందువాహిని జిల్లా అధ్యక్షుడు ఆర్యన్ మహరాజ్, బీజేపీ మండల అధ్యక్షుడు రమేశ్, స్థానికులు పాల్గొన్నారు.

షోలాపూర్ బజార్ సమితి సందర్శన



ఉల్లిగడ్డ అమ్మకంపై అధ్యయనం చేస్తున్న మార్కెట్ కమిటీ సభ్యులు

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం ఆధ్వర్యంలో శనివారం మహారాష్ట్రలోని షోలాపూర్ బజార్ సమితిని సందర్శించారు. షోలాపూర్ బజార్ సమితి అధికారులతో మాట్లాడి వ్యవసాయ మార్కెట్ నిర్వహణ, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి రైతులు పండించిన ఉల్లిగడ్డ అమ్మకాలపై జరుగుతున్న క్రయ విక్రయాలను క్షుణ్ణంగా పరిశీలించి అధ్యయనం చేసినట్లు ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం తెలిపారు. వైస్ చైర్మన్ సోయం మారుతి, కార్యదర్శి శ్రీనివాస్, కమిటీ డైరెక్టర్లు, సిబ్బంది ఉన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న ఆడే గజేందర్, నాయకులు

నేరడిగొండ: బీసీలకు 42 శాతం రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణకు శాసనసభలో ఆమోదం తెలపడంపై కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ హర్షం వ్యక్తం చేశారు. మండలం కేంద్రంలో శనివారం సంబరాలు జరుపుకోవడంతోపాటు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. బాణసంచాలు పేల్చారు. ఏఎంసీ ఉపాధ్యక్షుడు వసంత్ రావ్, నాయకులు పాల్గొన్నారు.

ప్రతీ గూడెంకు రోడ్డు సౌకర్యం కల్పిస్తాం

నియోజకవర్గంలోని ప్రతీ గూడెంకు రోడ్డు సౌకర్యం కల్పిస్తామని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. నేరడిగొండ మండలం కొర్టికల్(బి), కొర్టికల్(కె), లింగట్ల పంచాయతీ పరిధిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.20 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయినేజీల పనులను శనివారం ప్రారంభించారు. బోథ్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆడే వసంత్‌రావ్, నాయకులు ఏలేటి రాజశేఖర్ రెడ్డీ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నారాయణ్‌సింగ్, నియోజకవర్గ యువజన అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి పాల్గొన్నారు.

నీటిని సంరక్షించుకుందాం



ప్రజలకు నీటి బిందెలు అందజేస్తున్న శ్రీవల్లి

సిరికొండ: ప్రతి నీటి బొట్టును సంరక్షించుకుందామని జిల్లా భూగర్భ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీవల్లి పేర్కొన్నారు. ప్రపంచ నీటి దినోత్సవం పురస్కరించుకుని జాకీర్‌గూడలో ప్రజలకు నీటిబిందెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీటి వృథాను అరికట్టాలన్నారు. జిల్లా భూగర్భ శాఖ అధికారి పుల్లారావు, గ్రామపటేల్ భీంరావు, రాయిగూడ రాయిసెంటర్ సార్‌మోడి అమృత్‌రావు పాల్గొన్నారు.

బేల: సిర్సన్న గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో నీటి వనరులను సంరక్షించాలని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం సరోజదేవి, సీఆర్పీ వెంకన్న, ఆ సంస్థ జిల్లా ప్రతినిధి బోయర్ నరేందర్, వీడీసీ అధ్యక్షుడు సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

తలమడుగు: ప్రతిఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని బాలవికాస్ జిల్లా కోఆర్డినేటర్ ప్రసూన్ రెడ్డి అన్నారు. సుంకిడి ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ తీసి, మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేయించారు. హెచ్‌ఎం వాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

గెస్ట్ లెక్చరర్ల సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావన

ఉట్నూర్‌రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విధులు నిర్వర్తిస్తున్న గెస్ట్ లెక్చరర్ల సమస్యలపై శనివారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అసెంబ్లీలో ప్రస్తావించారు. ఈ సందర్భంగా కళాశాల గెస్ట్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర నాయకులు సోగాల ప్రవీణ్, సదయ్య జావిద్ ఆలీ మాట్లాడుతూ గెస్ట్ లెక్చరర్లకు 12 నెలల వేతనం ఇవ్వడం లేదని రోజు వారీగా చెల్లిస్తున్నారని తెలిపారు. ప్రతీ సంవత్సరం ఆటో రెన్యూవల్ చేసి 12 నెలల జీతం చెల్లించాలని, ఇతర సమస్యలపై అసెంబ్లీలో విన్నవించిన ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

లక్ష్మీపతి మృతి పార్టీకి తీరనిలోటు

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు జాడి లక్ష్మీపతి అనారోగ్యంతో మృతిచెందడం పార్టీకి తీరనిలోటని జెడ్పీ మాజీ చైర్మన్ జనార్దన్ రాథోడ్ పేర్కొన్నారు. ఆయన మృతదేహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాడే మోశారు. నాయకులు భరత్ చౌహాన్, పంద్ర జైవంత్‌రావు, ధరణిరాజేశ్, విజయ్, కలీం, అంజత్ తదితరులు పాల్గొన్నారు.

చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 ఉపయోగించుకోవాలి

బోథ్: మండల కేంద్రంలోని నాగభూషణం హైస్కూల్‌లో చైల్డ్ హెల్ప్‌లైన్ 1098పై అవగాహన కార్యక్రమాన్ని శనివారం ఏర్పాటు చేశారు. చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ సతీశ్ మాట్లాడుతూ పిల్లలు చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సేవలు వినియోగించుకోవాలన్నారు. సామాజిక కార్యకర్త వెంకటేశ్, పాఠశాల హెచ్‌ఎం కిశోర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

ఉట్నూర్‌రూరల్: దంతన్‌పల్లి పంచాయతీ పరిధి శివగూడకు చెందిన మెట్టు భీమయ్య రాజవ్వకు మంజూరైన రూ.19 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును నాయకులు శనివారం అందజేశారు. డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ లింగంపల్లి చంద్రయ్య, మతీన్, భాస్కర్, సురేశ్, రవి, మల్లవ్వ, రాజేశ్ ఉన్నారు.

రక్తదానం

తలమడుగు: ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి అన్నారు. మండలంలోని రుయ్యాడి గ్రామానికి చెందిన పూంద్రు లింగారెడ్డి అరుదైన గ్రూప్ (బీ నెగెటివ్) ఇప్పటివరకు 36 సార్లు రక్తదానం చేయగా శనివారం ఆయన నివాసానికి వెళ్లి సన్మానించి అభినందించారు. అనంతరం రుయ్యాడికి చెందిన బిట్ల సాయి చైతన్య ప్రభుత్వ ఉద్యోగం సాధించడంతో సత్కరించారు. ఉపేందర్, ఆశరెడ్డి, విలాస్, వెంకటరెడ్డి, సురేందర్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, దినేష్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.

నాయకత్వ లక్షణాలపై అవగాహన

సిరికొండ: మండల కేంద్రంలో మహిళా సమాఖ్య కార్యాలయంలో శనివారం జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నాయకత్వ లక్షణాల సాధించడం అంశంపై జెండర్ స్పెషలిస్టు కోటేశ్వర్ రావు శనివారం మహిళలకు అవగాహన కల్పించారు. జిల్లా సఖీ కేంద్రం వర్కర్ నాగమణి, మహిళా సమాఖ్య ఏపీఎం సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

పంచాయతీ సేవలపై అవగాహన

ఇంద్రవెల్లి: మండలకేంద్రంలోని జెడ్పీ పాఠశాల 8వ తరగతి విద్యార్థులకు శనివారం మండలకేంద్రంలోని మేజర్ పంచాయతీ కార్యాలయానికి వెళ్లారు. పంచాయతీ ద్వారా అందిస్తున్న సేవాలు, అభివృద్ధిపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు ఆత్రం క్రిష్ణవేణి, లక్ష్మణ్ ఉన్నారు.

ఉపాధి కూలీలకు అవగాహన

ఇచ్చోడ: కోకస్‌మన్నూర్‌లో శనివారం మహిళా శిశు సంక్షేమ శాఖ మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. జెడ్పీపాఠశాలలో విద్యార్థులకు నిపుణుడు నిఖిలేశ్వర్ రెడ్డి ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. జెండర్ స్పెషలిస్టు కోటేశ్వర్ పాల్గొన్నారు.

డీజీపీకి ఫిర్యాదు చేస్తాం

కైలాస్‌నగర్: ఎలాంటి ఆందోళన కార్యక్రమాలకు పిలుపు ఇవ్వకున్నా రాష్ట్ర వ్యాప్తంగా ఏఐవైఎఫ్ నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నట్లు అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా కార్యదర్శి మేస్రం భాస్కర్ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అక్రమ అరెస్టులపై డీజీపీకి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అరెస్ట్ చేసిన ఏఐవైఎఫ్ నేతలను భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అక్రమ అరెస్ట్ అప్రజాస్వామికం

ఉట్నూర్‌రూరల్: అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ.23,108 కోట్ల బడ్జెట్‌ను విద్యారంగానికి కేటాయించడం అన్యాయమని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ పేర్కొన్నారు. అసెంబ్లీ ముట్టడి నిరసనగా అర్ధరాత్రి 12 గంటలకు తన తోపాటు వెళ్తున్న కుర్సెంగ భూమన్నలను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అప్రజాస్వామికమన్నారు.

పాలీహౌస్ ఫీల్డ్ విజిట్

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్‌లోని బీఎస్సీ అగ్రికల్చర్ కళాశాల ఆధ్వర్యంలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్ కోర్స్‌లో భాగంగా పాలీహౌస్ ఫీల్డ్ విజిట్ కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. మావల సమీపంలోని పాలీహౌస్‌ని సందర్శించారు. టీచింగ్ అసోసియేట్స్ డాక్టర్ కె.మౌనిక, డాక్టర్ రాథోడ్ సునీల్ కుమార్, డాక్టర్ కిరణ్ కుమార్, ల్యాబ్ అసిస్టెంట్లు రాజు, ప్రశాంత్ చౌహాన్, సందీప్ రాథోడ్‌తోపాటు శ్రీకాంత్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

బేల: ఎండకాలం దృష్ట్యా మండల రెవెన్యూ బృందం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహసీల్దార్ రఘునాథ్‌రావు ప్రారంభించారు. డిప్యూటీ తహసీల్దార్ వామన్‌రావు, ఆర్‌ఐలు అశోక్, సాజిద్, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

గుడిహత్నూర్: మండలంలోని గోండ్‌హర్కాపూర్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ శనివారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తూ గ్రామాల అభివృద్ధికి పాటుపడుతుందన్నారు. ఆయన వెంట రైల్వే యూజర్స్ బోర్డు సభ్యుడు బోసారే గణేశ్ పాటిల్, బీజేపీ మండల అధ్యక్షుడు కేంద్రే శివ, నాయకులు కుమార్ కేంద్రే, జాలీం తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న సప్తాహ

ఇంద్రవెల్లి: మండలంలోని దనోరా(బి) గ్రామంలోని విఠల రుక్మాయి ఆలయంలో విఠల్ రుక్మాయి ఉత్సవ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సప్తాహ కార్యక్రమం కొనసాగుతోంది. శనివారం మూడో రోజు మహారాష్ట్రకు చెందిన సాక్షి తాయి మహరాజ్ ఆధ్వర్యంలో శివపురణ్ కథను బోధించారు. గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

నేరడిగొండ: అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. పెట్రోలింగ్‌లో భాగంగా మండలంలోని బోథ్ ఎక్స్‌రోడ్ సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇఫ్తార్ విందు

ఉట్నూర్‌రూరల్: రంజాన్ మాసం పురస్కరించుకొని ఉట్నూర్ ఐటీడీఏ రిటైర్డ్ ఈఈ రాథోడ్ భీంరావు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పాత ఉట్నూర్‌లో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. అనంతరం ముస్లిం సోదరులు ఆయన్ను సన్మానించారు. కాంట్రాక్టర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు జైనొద్దీన్, హఫీజ్, నిసార్, ఖయ్యుం, అజర్‌ఖాన్, జుబేర్, అల్తాఫ్, మున్వర్, తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి

తాంసి: ప్రతిఇంటా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని ఎంపీడీవో గడ్డం మోహన్‌రెడ్డి సూచించారు. మండలంలోని గిరిగాం గ్రామంలో శనివారం అధికారులతో కలిసి గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. వర్షపునీరు వృథా పోకుండా ఇంకుడుగుంతలు నిర్మించి భూమిలోకి వెళ్లేలా చూడాలన్నారు. అనంతరం గ్రామంలోని బావులు, బోరుబావులను పరిశీలించారు. ఏవో రవీందర్, ఏపీవో విజయ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రశాంత్, పంచాయతీ కార్యదర్శి కార్తీక్, ఏఈవో నిఖిత, గ్రామస్తులు ధనుంజయ్, కిషన్ తదితరులు ఉన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: కనీస వేతనాల జీవో వెంటనే అమలు చేయాలని టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్ సింగ్ అన్నారు. జిల్లాకేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ జీఓల గెజిట్ అమలు చేయడం లేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వ విధానాలే కాంగ్రెస్ అమలు చేస్తుందన్నారు. 2021 జూన్‌లో విడుదలైన జీఓలను నేటికి గెజిట్ ఆమోదించకపోవడం శోచనీయమన్నారు.

పశువుల సంత @ రూ.11.50 లక్షలు

బేల: సాంగిడి పంచాయతీ కార్యాలయంలో ప్రతీ మంగళవారం నిర్వహించే పశువుల సంత వేలం పాట శనివారం నిర్వహించారు. రూ.11.50 లక్షలకు ఏడాది పాటు(2025–26) సంత నిర్వహణకు స్థానికుడు కన్నాల మహేందర్ దక్కించుకున్నాడు. మండల ప్రత్యేక అధికారి మనోహర్‌రావు, ఎంపీడీవో మహేందర్‌కుమార్, ఎంపీవో మహేశ్‌కుమార్, కార్యదర్శి గౌతమ్ పాల్గొన్నారు.